చకచకా ఇళ్ల నిర్మాణం


పామర్రు నియోజకవర్గం మొవ్వ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు


కైకలూరు నియోజకవర్గం భైరవపట్నం జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు

- మొవ్వ, భైరవపట్నం జగనన్న కాలనీల్లో ఊపందుకున్న పనులు
- విద్యుత్, తాగునీటి వసతులు కల్పన
- ఊపందుకున్న గృహ ప్రవేశాలు

మొవ్వ/మండవల్లి: పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. మొవ్వ మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ పథకంలో మొవ్వ మండలంలోని వందలాది మంది పేదలు తమ కలల గూడును నిర్మించుకుంటున్నారు. మండలంలో 26 లే అవుట్లు ఉన్నాయి. ఇటీవల చినముత్తేవి, కూచిపూడిలో మరో రెండు లేఅవుట్‌ల ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపినట్లు తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 2598 ఇళ్లు మంజూరయ్యాయి. పెదపూడి, కూచిపూడి, కాజలోని రెండు లేఅవుట్‌లు, భట్లపెనుమర్రు, మొవ్వ, నిడుమోలు, వేములమడ, గూడపా


పెదపూడి జగనన్న లేఅవుట్‌లో పూర్తయిన సుభాషిణి ఇల్లు

డులోని జగనన్న కాలనీల్లో 995మందికి ఇళ్లు మంజూరయ్యాయి. 351 మంది లబ్ధిదారులు ఇళ్ల పనులు ప్రారంభించారు. వీరికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తోంది. వీటిలో 133 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చాలా మంది గృహ ప్రవేశాలు చేశారు. మిగిలిన వాటిలో 50 శాతానికి పైగా శ్లాబ్ లెవల్ దాటాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ లేఅవుట్లలో అధికారులు మౌలిక వసతులు ఏర్పాటుచేస్తున్నారు. తాగునీటికి ట్యాంక్ నిర్మిస్తున్నారు. అలాగే సొంత స్థలాల్లో 956 మంది ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సాయం అందజేస్తోంది. వీటిలో 364 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 376 బిలో బేస్‌మెంట్, 116 బేస్‌మెంట్, 68 రూఫ్ లెవల్, 23 స్లాబ్ లెవల్‌కు చేరాయి.

భైరవపట్నం జగనన్న కాలనీలో..

మండలంలోని భైరవపట్నం జగనన్న కాలనీలో 4.15 ఎకరాల స్థలంలో 198 మందికి నివేశన స్థలాలు కేటాయించారు. ఈ కాలనీలో ఇప్పటివరకు 48 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. 72 గృహ నిర్మాణాలు బేస్‌మెంట్ లెవెల్‌లో, మరో నాలుగు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయి. మిగిలినవి బరంతు తోలుకుని నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం పూర్తైంది



ఇంటి నిర్మాణం పూర్తైంది. మేము చాలా ఏళ్లు అద్దె ఇంటిలో ఉండి ఇబ్బందులు పడ్డాం. జగనన్న ప్రభుత్వం మాకు ఇంటి స్థలం ఇచ్చింది. ఇంటి నిర్మాణానికి బిల్లులు వేగంగా మంజూరు చేసింది. డ్వాక్రా ద్వారా ఆర్థిక సహకారం అందించారు.
–కొప్పుల సుభాషిణి, పెదపూడి

జగనన్న ఇచ్చిన వరం



మాది మొవ్వ మండలం కొండవరం గ్రామం. మేము చాలా కాలం తాటాకు ఇంటిలో జీవించాం. జగనన్న వచ్చాక పక్కా ఇల్లు మంజూరైంది. ఇల్లు కట్టుకుంటున్నాం. స్లాబు స్థాయికి వచ్చింది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తి చేస్తాం.
–కాకుళ్ల సునీత, కొండవరం

సొంతింటి కల నెరవేస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు గృహవసతి కల్పించటానికి స్థలాలు కేటాయించడమే కాక నిర్మాణాలకు నిధులు అందజేస్తూ కల నెరవేర్చారు. ఏళ్ల తరబడి ఉన్న పేదల కలను తీర్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించారు.
– పొనుగుమాటి సామ్రాజ్యవాణి, సర్పంచ్, భైరవపట్నం,

ఉగాదిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి


కైకలూరులో గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఉగాదికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల గృహ నిర్మాణశాఖ అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నివేశన స్థలాలకు భూమి అందుబాటులో లేకపోతే రెండు, మూడు గ్రామాల్లో కొనుగోలు చేస్తామన్నారు. తరుగుమూల, లోకుమూడి లేఅవుట్ల పూడికపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈఈ రమణమూర్తి, కైకలూరు, మండవల్లి, కలిదిండి తహసీల్దార్లు మురళీకృష్ణ, జనార్దనరావు, తేజమణి, ముదినేపల్లి ఎంపీడీఓ మల్లీశ్వరి, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో మల్లీశ్వరి లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని కోడూరులో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

గుడివాడటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని డీవైఈఓ డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. స్థానిక టౌన్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులతో ఆయన శనివారం మాట్లాడారు. తొలుత పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించిన అనంతరం 8, 10 తరగతుల విద్యార్థులను వివిధ సబ్జెక్టులపై ప్రశ్నించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగించుకుంటున్నారు, బైజూస్ క్లాసులు అర్థం చేసుకుంటున్నారా లేదో పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



గుడివాడటౌన్: ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఉపయోగపడతాయని స్థానిక ప్రాంతీయ హోమియో పరిశోధనా సంస్థ(ఆర్ఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. స్థానిక విద్యాలయ పబ్లిక్ స్కూల్‌లో ఆర్ఆర్ఐ ఆధ్వర్యాన చిరుధాన్యాలపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకుంటే పెద్దవారిలో జీర్ణశక్తి, రోగ నిరోధకశక్తి పెరుగుతుందని మధుమేహవ్యాధి నియంత్రణలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బృంద ఉపాధ్యాయిని, డాక్టర్ రాజేష్, విద్యాలయ డైరెక్టర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో నూరు శాతం ఉత్తీర్ణత


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

గుడ్లవల్లేరు: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ చెప్పారు. డోకిపర్రు ఎస్ఎస్‌వీజీఆర్ గవర్నమెంట్ హైస్కూల్లోని టెన్త్ విద్యార్థులకు శనివారం ఆయన కెరీర్ గైడ్‌లైన్స్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.బి.వి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయ పడవద్దు

నిమ్మకూరు(పామర్రు): విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని అంగలూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. నిమ్మకూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజన పథక వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పసుమర్రు(పామర్రు): పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌ను డైట్‌కళాశాల ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడటౌన్: నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ ప్రాంతీయ కార్యాలయం నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ శనివారం తెలిపారు. ఈనెల 24న విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన సెమినార్, క్విజ్ పోటీల్లో విద్యార్థులు కె.హరితశ్రీ, ఎస్.కుసుమ, బి.పవన్, ఎండీ యాసీన్ అహ్మద్‌ల జట్టు విశేష ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం కైవసం చేసుకున్నారన్నారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శివనాథ్, స్టాటిస్టిక్స్ అధ్యాపకులు శ్రీదేవి, రమేష్, అపర్ణ అభినందించారు.

మహిళా సంక్షేమానికి రక్షణ సైన్యం సేవలు నిరుపమానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మహిళా సంక్షేమానికి రక్షణ సైన్యం అందజేస్తున్న సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రక్షణ సైన్యం గృహ సమితి మహిళా సదస్సు శనివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల భద్రత, సంక్షేమంపై చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. డీసీ మేజర్ పి.మణిబాబు, అధ్యక్షతన సమావేశం జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ కెజియాస్టాలిన్, అన్నామణి, మెర్సీ మంజుల, మేజర్ పి.అమృతవాణి, సర్పంచ్ మెండా రూఫస్, సొసైటీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.యేసోబు రాజు, నాయకులు పాల్గొన్నారు.

'సంక్షేమ'ంతో వైఎస్సార్ సీపీ గెలుపు

- ఎంపీ కోటగిరి శ్రీధర్
- తాడినాడలో 175వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం


కేక్ కోసి తినిపించుకుంటున్న ఎంపీ కోటగిరి, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ

కైకలూరు(కలిదిండి): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న పథకాలే రానున్న ఎన్నికల్లో విజయానికి కీలకమవుతాయని, కైకలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో 175వ రోజు కలిదిండి మండలం తాడినాడలో శనివారం జరిగింది. వైనాట్ 175 అంటూ సీఎం చెప్పిన మాటలకు సరిపోతూ గడప గడపకు కార్యక్రమం 175వ రోజుకు చేరడంతో భారీ కేక్‌ను ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ కట్ చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ జయమంగళ వెంకటరమణ వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు ప్రాంత ప్రజలకు రెగ్యులేటర్ల నిర్మాణం, భూముల రీసర్వే, వడ్డీల సామాజికవర్గ వ్యక్తికి ఎమ్మెల్సీ కేటాయింపు వాగ్దానాలు ఇచ్చిన మేరకు జయమంగళకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ మాట్లాడుతూ మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ స్వార్థ రాజకీయాలు చేశారన్నారు. దమ్ముంటే మాజీ మంత్రి కామినేని ఇక్కడ నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో మొదటి స్థానం రావడానికి కార్యకర్తలు ఇచ్చిన ప్రోత్సాహమే కారణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి శ్రీదేవి, ఘంటా సంధ్య, ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్లు బనాల బ్రహ్మాజీరావు, దండే పుష్పలత, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, సునీత, రాచూరి రాధ, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, భత్రాజు శివాజీ, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, సయ్యపురాజు గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు(కలిదిండి): కలిదిండి మండలం తాడినాడ గ్రామంలో శనివారం 175వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ ప్రజలకు అందించారు. కార్యక్రమంలో శేషుబాబు, విష్ణువర్ధన్, రామకృష్ణ, సర్పంచ్‌లు మసిముక్కల మారుతీప్రసన్న, తిరుమలశెట్టి జ్యోతి, గండికోట ఏసుబాబు, కలిదిండి పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి, ఎంపీటీసీ సభ్యులు పేటేటి రామకృష్ణ, ఐమ్మానేని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లను దూరం పెడితేనే విద్యపై ఏకాగ్రత

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి షణ్ముఖరావు


మరుగుదొడ్ల నిర్వహణపై హాస్టల్ వార్డెన్‌ను ప్రశ్నిస్తున్న జడ్జిలు షణ్ముఖరావు, శ్రీహరి

కైకలూరు: విద్యార్థులు సెల్‌ఫోన్ల వాడకానికి దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత నిలపాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.శ్రీహరితో కలసి ఆయన స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా న్యాయసేవాధికారి ఉత్తర్వుల మేరకు కైకలూరు మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ హోదాలో శనివారం తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణలో దుర్వాసన, మరుగుదొడ్లలో శుభ్రత లోపించడం, హాస్టల్ గదుల్లో ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు మరమ్మతులకు గురవడం, దిండ్లు, పరుపులు లేకపోవడాన్ని వారు గుర్తించారు. అక్కడి సమస్యలపై హాస్టల్ వార్డెన్ రవిప్రకాష్‌ను జడ్జిలు ప్రశ్నించగా, వార్డెన్ స్పందిస్తూ డ్రెయిన్ సౌకర్యం సక్రమంగా లేదని, సిబ్బంది కొరత ఉందని చెప్పారు. భవన మరమ్మతులకు ప్రభుత్వం రూ.9 లక్షలు కేటాయించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. అనంతరం జడ్జిలు విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి


మాట్లాడుతున్నమున్సిపల్ కమిషనర్

గుడివాడటౌన్: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ లోని 2వ సచివాలయం, సత్యనారాయణపురంలోని 23, 24 సచివాలయాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉద్యోగుల హాజరు పట్టీలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తదితర అంశాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు గంగానమ్మకు జలాభిషేకం

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి 11వ పునః ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఆదివారం మూలమూర్తికి జలాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు శనివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు అభిషేకాలు ప్రారంభమవుతాయని, భక్తులు స్వయంగా అమ్మవారిని జలాలలో అభిషేకించేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి విశేష పూజలు ఉంటాయన్నారు. రాత్రి 7 గంటలకు మహా చండీయాగానికి సంబంధించి సంకల్పం, గణపతి పూజ, అఖండ స్థాపన, మంటపారాధన, దీక్షా ధారణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం మహా చండీ యాగం, అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

చురుగ్గా వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు



పామర్రు: జల జీవన్ మిషన్-హర్ ఘర్ జల్ పథకంలో భాగంగా పామర్రు(మెయిన్)లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మంచినీటి సరఫరా, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేసి ఎఫ్‌హెచ్‌టీసీ ఏర్పాటుకు సుమారు రూ 2.30 కోట్ల నిధులతో ట్యాంక్ పనులు ప్రారంభించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అందరికీ పుష్కలంగా తాగునీరు అందించడానికి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ఘనంగా పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు: భక్తులపాలిట కొంగు బంగారం కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. శనివారం జాతర ఐదో రోజుకు చేరింది. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు జలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారికి చతుర్ద్వారణ పూజ, కలశార్చన, అష్టోత్తర నామార్చన, పుష్పాలంకరణ, ధూపసేవ, బాలభోగం, చతుర్థీనామావరణ పూజ, హారతి, మంత్ర పుష్ప సమర్పణ పూజాదికాలు జరిగాయి. భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి రామలింగరాజు, రామసీత, మూరి నాగ వెంకట సుబ్బరాజు, దారదేవి, నాగసౌర్య, పేరిచర్ల హేమంత్ వర్మ ప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ నటరాజ నాట్య కళాశాల (గుడివాడ) చిన్నారుల కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దస్తావేజు పోయినది

పట్టణంలో సి ఆస్తి మస్జిదె ఖుబా జమియతె అహలెహదీస్, గుడివాడకు చెందిన ఆస్తి దస్తావేజులు డాక్యుమెంట్ నెం. 1418/2009 ఒరిజినల్ దస్తావేజులు ది. 17-02-2023న ఏలూరురోడ్‌లో సింధూర థియేటర్‌కు ఎదురుగా ఉన్న విజయదుర్గ ఫొటోస్టాట్ దగ్గర పోయినవి, దాని ఆచూకీ తెలిసినవారు తెలియజేయగలరు.
ఇట్లు : అబ్దుల్ బారి
అధ్యక్షులు : మస్జిదె ఖుబా జమియతె అహలెహదీస్, గుడివాడ, సెల్ : 98887 77525

ప్రజాసేవకుడు రామకృష్ణ



గుడివాడటౌన్: నిత్యం ప్రజాసేవ చేస్తూ గౌరవ డాక్టరేట్ పురస్కారం పొందిన మాచర్ల రామకృష్ణ(ఆర్కే)ను సత్కరించడం పౌరుల కనీస ధర్మమని తారకరామ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ అలీ అన్నారు. శనివారం క్లబ్ ఆధ్వర్యాన ఆర్కేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొల్లభత్తుల రామకృష్ణ, దండమూడి సీతారామస్వామి, బొగ్గారపు తిరుపతయ్య, చిన్నం గంగాధర్, సాయిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూములు సారవంతం

గూడూరు: రబీలో మినుము సాగు చేస్తున్న రైతులు పంట కోసిన తర్వాత పచ్చిరొట్ట వేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.హెప్సిబా రాణి అన్నారు. పోసినవారిపాలెంలో శనివారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పొలంబడి నిర్వహించారు. రబీలో చేపట్టిన అపరాల సాగు ఆశాజనకంగా ఉండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కోత పూర్తయిన తర్వాత పచ్చిరొట్టగా జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు వేయాలని ఏఓ సూచించారు.

క్లుప్తంగా

225 మందికి ఉచిత వైద్య సేవలు

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడు పీఏసీఎస్‌లో ఆ సంఘాధ్యక్షుడు శేషం గోపి ఆధ్వర్యాన రమేష్ హాస్పటల్ వైద్య శిబిరం నిర్వహించింది. శనివారం జరిగిన శిబిరాన్ని డాక్టర్ వై.ప్రియాంక ప్రారంభించారు. 225 మందికి డాక్టర్ ప్రియాంక, కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.మహేష్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

'దిశ'పై అవగాహన

గుడ్లవల్లేరు: దిశ చట్టంపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్.ఐ వి.ఏసేబు అన్నారు. గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో శనివారం విద్యార్థినులకు దిశ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ చట్టంతో విద్యార్థులకు రక్షణ కలుగుతుందన్నారు. మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెదపూడిలో అన్నసమారాధన



పెదపూడి(మొవ్వ): మండలంలోని పెదపూడిలో సీతారామ చంద్రస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ చేసి 16రోజులు పూర్తైన సందర్భం పురస్కరించుకుని శనివారం అన్నవితరణ జరిగింది. సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

గంగానమ్మ జాతరకు ఏర్పాట్లు



పామర్రు: గంగానమ్మ ఆలయ వార్షిక జాతర ఈ నెల 27 నుంచి ప్రారంభంకానుంది. దీని కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని ఆలయ కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ 27వ తేదీ నుంచి మార్చి 5 వరకు జాతర జరుగుతుందన్నారు. వారం రోజులు మేళతాళాలు, కనక తప్పెట్లతో అమ్మవారిని ఊరేగిస్తారని తెలిపారు. ఐదో తేదీ అమ్మవారు ఆలయంలోకి ప్రవేశించిన తర్వాత భక్తులు మొక్కుబడులు తీర్చుకోవచ్చని దీనికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, సభ్యులు బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే.. రథసారథులు



గుడివాడటౌన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి గృహసారథులే రథసారథులు కావాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్‌లో శనివారం గుడివాడ రూరల్ మండల గృహసారథుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులు ఉంటారన్నారు. కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు ఎస్ఎంఆర్ పెదబాబు, సీనియర్ నేత దుక్కిపాటి శశిభూషణ్, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ బట్టు నాగమల్లీశ్వరి, ఎంపీటీసీ అంగడాల శ్రీరామాంజనేయులు, కారె జోసఫ్, నారాయణరావు, మునిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా కూతాడి

కూచిపూడి(మొవ్వ): మండలంలో కూచిపూడిలోని వక్షుల బీడులో శనివారం ఎస్సీ,ఎస్టీ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇంటూరి ఏలియా ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో కూచిపూడికి చెందిన కూతాడి శ్రీనుని సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, శ్రీనివాసరావు, కె.కేశవ, కె.రవిచంద్ర, కె.చిట్టిబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌ను కలిసిన క్రైస్తవ సంఘ నేతలు

కైకలూరు: వెస్ట్ ఆకివీడు ఫీల్డ్ కౌన్సిల్, సీబీసీఎన్‌సీ ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన కమిటీ శనివారం స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను మర్యాదపూర్వకంగా ఆయన ఇంటి వద్ద కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు ప్రత్యేక నిధులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నూతన అధ్యక్షులు పీతల నెహెమియాకుమార్, సెక్రటరీ కాకర్ల శ్రీనివాసరావు, ట్రెజరర్ గాబ్రియేలు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.